కేంద్ర ఎన్నికల స్టంట్ యూసీసీ



మాట్లాడుతున్న ఎంఎల్సీ కె.ఎస్ లక్ష్మణరావు

ఒంగోలు: దేశంలో యూనియన్ సివిల్ కోడ్ (ఏక పౌరస్మృతి)ని అమలు చేస్తామని కేంద్రం పేర్కొంటుండడం కేవలం ఎన్నికల స్టంట్ మాత్రమే అని, కేంద్రంపై వస్తున్న వ్యతిరేక వైఖరి నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు ఈ ఎత్తుగడ అని ఎంఎల్సీ లక్ష్మణరావు అన్నారు. సోమవారం స్థానిక యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఏకరూప పౌరస్మృతి ఎవరి కోసం అనే అంశంపై లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. అందరికీ ఒకే దేశం..ఒకే చట్టం ఉన్నప్పుడు అందరికీ సమానహక్కులు, సమ న్యాయం ఇవ్వాల్సి ఉంటుందని, అందర్నీ ఒకేలా చూడాల్సి ఉంటుందన్నారు. వ్యక్తుల్లో కొందరిని వెనుకబడిన వర్గాలుగా జమకట్టి వారి ముఖాలపై మూత్రం పోసే దారుణమైన సంస్కృతిని పెంచి పోషించే చర్యలను ఏమనాలన్నారు. యూసీసీని అమలు చేస్తే దేశంలో అందరికీ మతాచారాలతో సంబంధం లేకుండా ఒకే విధమైన వివాహం చేసుకోవాలనే చట్టం తేవడం సాధ్యమేనా అని ప్రశ్నించారు. నిజానికి భారతదేశంలో బహుభార్యత్వం తాలూకా నివేదికలను పరిశీలిస్తే 1961 గణాంకాల ప్రకారం ముస్లింలల్లో 5.7 శాతం ఉంటే హిందువుల్లో 5.8 శాతం ఉంది, జైన్స్‌లో 6.7 శాతం, బుద్దిస్టులలో 7.9 శాతం ఉన్నట్లు తేలిందన్నారు. కానీ 2019–21 గణాంకాల ప్రకారం అన్ని మతవర్గాల్లోనూ బహుభార్యత్వం తగ్గుతూ వచ్చిందన్నారు. యూసీసీ రావడం వల్ల దేశ సమస్యలైన నిరుద్యోగం, పేదరికం, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల వంటి సమసక్యలు తొలగిపోతాయా? దేశ ఆర్థికాభివృద్ధి పెరిగిపోతుందా? అనే ప్రశ్నలకు కేంద్రం సమాధానం చెప్పాలన్నారు. ఇటువంటి సమస్యల పరిష్కారానికి కృషి చేయకుండా దేశంలో అమలు సాధ్యం కాని యూసీసీని తేవడానికి ప్రయత్నాలు చేయడం కేవలం ప్రజల భావోద్వేగాలతో ఎప్పుడూ మైండ్‌గేమ్ ఆడే పొలిటికల్ పార్టీల ఎన్నికల స్టంట్ మాత్రమే అన్నారు. ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ ఇలాంటి వివాదాలు రేకెత్తించడం వల్ల అధికార పార్టీకి కలిగే ప్రయోజనాలు, పెరుగుతున్న ధరలు, నిరుద్యోగం, ఉద్యోగుల తొలగింపు వంటి వాటినుంచి ప్రజల దృష్టిని మళ్లించడం కోసమే అని ధ్వజమెత్తారు. ఒక వర్గానికి వ్యతిరేకంగా మెజార్టీ వర్గాన్ని ఎగదోసి ఓట్లు రాల్చుకోవడమే వారి ఉద్దేశమన్నారు. యూసీసీ ప్రతిపాదనను కాదన్న వారంతా దేశ సమైక్యతకు, అభివృద్ధికి ఆటంకులుగా చిత్రీకరించాలని పథకం పన్నారని, అందుకోసం 22వ లా కమిషన్‌ను నియమించారన్నారు. మోదీ ఇదే అంశంపై 2018లో 21వ లా కమిషన్‌ను వేస్తే ప్రస్తుత పరిస్థితుల్లో యూసీసీ అనవసరం అని, అవాంఛనీయం అని రిపోర్టు వచ్చిందన్నారు. ముందు అన్ని మతాల మహిళల వివక్షపై దృష్టిపెట్టి సంస్కరించుకోవాలని, ఆ రిపోర్టు ప్రస్తుత పరిస్థితులకు, రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా ఉందని పేర్కొనడం జరిగిందన్నారు. కానీ మోదీ పరివారపు వ్యూహాలకు అనుగుణంగా లేకపోవడంతో దాన్ని చెత్తబుట్టలో వేశారని , కేవలం 2024 ఎన్నికలు జరిగే వరకు యూసీసీపై ఎడతెగని చర్చలు జరిపి ప్రజల దృష్టిని మరల్చాలన్నదే వారి వ్యూహం అని విమర్శించారు. డాక్టర్ హరిబాబు, పలు ప్రజా సంఘాల నాయకులు కంకణాల ఆంజనేయులు, రాంబాబు, రఘురామ్, రవిబాబు పాల్గొన్నారు.

కమిషనర్ స్పందనకు 16 అర్జీలు



అర్జీదారులతో మాట్లాడుతున్న కమిషనర్

ఒంగోలు సబర్బన్: నగర పాలక సంస్థ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 16 మంది తమ సమస్యలను అర్జీల రూపంలో అందజేశారు. పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి 4 అర్జీలు, శానిటేషన్ 3, రెవెన్యూ 5, ఇంజినీరింగ్ విభాగానికి చెందిన 4 అర్జీలు స్వీకరించారు. కమిషనర్ మాట్లాడుతూ స్పందనలో వచ్చిన అర్జీలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామన్నారు. నిర్ణీత గడువులో వాటిని పరిష్కరించాలని ఆదేశించామన్నారు. అనంతరం కలెక్టర్ నిర్వహించిన స్పందన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొని ఒంగోలు నగర పాలక సంస్థ విషయాలను వివరించారు. పలు విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

సేవల గుర్తింపునకు డాక్టరేట్



బూచేపల్లి వెంకాయమ్మను సత్కరిస్తున్న షేక్ ఖాదర్ బాషా



డాక్టరేట్‌ను అందుకుంటున్న క్విస్ అధ్యాపకుడు తెలికేపల్లి శ్రీనివాస్

చీమకుర్తి: ముస్లిం డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ జిల్లా నాయకులు షేక్ ఖాదర్ బాషాకు హోప్ ఇంటర్నేషనల్ రికార్డ్ వారు డాక్టరేట్ అవార్డును ఆదివారం హైదరాబాద్‌లో అందించారు. చీమకుర్తికి చెందిన షేక్ ఖాదర్‌బాషా, ముస్లిం సంఘాలకు చేసిన సేవలకు గుర్తుగా ఈ అవార్డు వచ్చింది. సోమవారం చీమకుర్తిలోని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డిని కలిశారు. వారికి శాలువాలు కప్పి షేక్ ఖాదర్‌బాషా సత్కరించారు. అవార్డు రావడం పట్ల అభినందించారు.



పి.మోజెస్ ప్రభాత్

మోజెస్ ప్రభాత్‌కు పీహెచ్‌డీ

ఒంగోలు: నగరానికి చెందిన పి.మోజెస్ ప్రభాత్‌కు పీహెచ్‌డీ అవార్డు లభించింది. ఇన్‌ఫ్లుయెన్స్ ఆఫ్ మార్కెటింగ్ మిక్స్ ఫ్యాక్టర్స్ ఆన్ కన్స్యూమర్ బిహేవియర్ (విత్ స్పెషల్ రిఫరెన్స్ టు ఓటీటీ ప్లాట్ ఫార్మ్స్ ఇన్ ఇండియా) అనే అంశానికి సంబంధించి మోజెస్ ప్రభాత్ సబ్‌మిట్ చేసిన పరిశోధన పత్రానికి ఆచార్య నాగార్జున యూనివర్శిటీ నుంచి ఈ అవార్డు లభించింది. ఈ రీసెర్చికి గైడ్‌గా డాక్టర్ కృష్ణ బాణాన వ్యవహరించారు.

క్విస్ అధ్యాపకునికి డాక్టరేట్

ఒంగోలు: స్థానిక క్విస్ ఇంజినీరింగ్ కాలేజీలో గణిత శాస్త్ర విభాగంలో అధ్యాపకునిగా పనిచేస్తున్న తెలికేపల్లి శ్రీనివాస్ గణిత విభాగంలో పజి ఐడియల్స్ ఇన్ పార్షియల్ ఆర్డర్డ్ గామా సెమీ గ్రూప్స్ అనే అంశంపై ఆచార్య నాగార్జున యూనివర్శిటీ నుంచి డాక్టరేట్ పట్టాను పొందారు. డాక్టర్ ఎ.గంగాధర్‌రావు పర్యవేక్షణలో చేసిన పరిశోధనలకు గాను ఈ డాక్టరేట్ ఆయనకు లభించింది. ఈ సందర్భంగా సోమవారం క్విస్ కాలేజీలో జరిగిన కార్యక్రమంలో శ్రీనివాస్‌ను కాలేజీ చైర్మన్ డాక్టర్ ఎన్.సూర్యకళ్యాణ్ చక్రవర్తి, కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వై.హనుమంతరావు ఆయను అభినందించారు.

పోలేరమ్మకు ప్రత్యేక పూజలు



ఊరేగింపు నిర్వహిస్తున్న మహిళలు



ఉలవపాడులో జరుగుతున్న పోలేరమ్మ పొంగళ్లు

ఉలవపాడు: ఉలవపాడులోని పోలేరమ్మ దేవస్థానంలో జరుగుతున్న పోలేరమ్మ పొంగళ్లలో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం తెల్లవారుజామున మహాలక్ష్మమ్మ చెట్టు నుంచిపోలేరమ్మ గుడి వరకు మహిళలు చద్దితో ఊరేగింపు చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు జరిపారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి మేళతాళాలు, తప్పెట్ల మధ్య గ్రామోత్సవం సాగింది. భక్తులు భారీగా పాల్గొన్నారు.

నారాయణస్వామి ఆలయ ఆదాయం రూ.2.18 లక్షలు



విరాళం అందజేస్తున్న దాత నారాయణరావు

సీఎస్‌పురం (పామూరు): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం నారాయణస్వామి ఆలయానికి ఆదివారం వరకు రూ..2,18,284 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ నర్రా నారాయణరెడ్డి తెలిపారు. స్వామి దర్శనం టిక్కెట్ల అమ్మకం ద్వారా రు.71,980, లడ్డుప్రసాదాల అమ్మకం ద్వారా రూ..30,150, ఆలయం వద్ద నిర్వహిస్తున్న శాశ్వత అన్నదానం పథకం నిర్వహణకు విరాళాలుగా రూ.91,038, ఆలయం వద్ద నిర్మిస్తున్న మహాప్రాకార నిర్మాణానికి విరాళంగా రూ.25,116 వచ్చినట్లు తెలిపారు. కాగా శాశ్వత అన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన అట్లూరి నారాయణరావు డాక్టర్ సౌజన్య దంపతులు రూ.50,116 విరాళం నగదును ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు కొమ్మినేని చిన ఆదినారాయణకు అందజేశారన్నారు. ఆలయ కమిటీ సభ్యులు మంచికంటి మధు, అనిల్, సిబ్బంది పాల్గొన్నారు.

1539 బేళ్లు విక్రయం

కందుకూరు: కందుకూరు పొగాకు వేలం కేంద్రాల్లో సోమవారం జరిగిన పొగాకు వేలంలో 1539 బేళ్లను విక్రయించారు. వీటిలో కందుకూరు–1వ వేలం కేంద్రంలో 832 వేలానికి ఉంచగా 751 బేళ్లు, కందుకూరు–2 వేలం కేంద్రంలో 855 బేళను వేలానికి ఉంచగా 788 బేళ్లు విక్రయించారు. రెండు వేలం కేంద్రాల్లోను అత్యధిక ధర రూ.270 లభించగా, అత్యల్ప ధరలు వరుసగా రూ.150, రూ.160 లభించాయి.

1152 పొగాకు బేళ్లు కొనుగోలు

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రానికి సోమవారం టంగుటూరు, జరుగుమల్లి, వావిలేటిపాడు, సాదువారిపాలెం గ్రామాల రైతులు 1230 బేళ్లు తీసుకురాగా వాటిలో 1,152 కొనుగోలయ్యాయి. 78 పొగాకు బేళ్లను వ్యాపారులు తిరస్కరించారు. గరిష్ట ధర కేజీ రూ.270, కనిష్ట ధర రూ.160, సరాసరి ధర రూ.257.47 పలికింది.

అంకమ్మతల్లి ఆలయానికి విరాళాలు

కందుకూరు: గ్రామదేవత అంకమ్మతల్లి ఆలయ పునఃనిర్మాణంలో భాగంగా అమ్మవారి పాదాల చెంత ఉంచే బంగారు సువర్ణ యంత్రానికి కనిగిచెర్ల వెంకటేశ్వరరావు, విజయలక్ష్మి దంపతులు, శ్రీనివాసరావు, వెంకటగీతానాగలక్ష్మి దంపతులు రూ.6251 చొప్పున విరాళం అందజేశారు. అలాగే దివంగత ఆకుమళ్ల మల్లికార్జునరావు జ్ఞాపకార్థం వారి కుమారులు రూ.6251, డోగిపర్తి సుబ్బారావు, సుజాతకుమారిలు రూ. 1116 విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యుడు ఎనిమిరెడ్డి వెంకటరెడ్డికి అందజేశారు. కమిటీ సభ్యులు మాదాల మాల్యాద్రి, చక్కా వెంకట కేశవరావు, బాలకోటేశ్వరరావు పాల్గొన్నారు.

2వేల మందికి అన్నదానం

గుడ్లూరు: మండలంలోని పూరేటిపల్లిలో పీర్ల పండుగ ముగిసిన మూడవ రోజు సోమవారం ముస్లింలు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉన్న దర్గాలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలోని హిందూ, ముస్లిం ఆధ్వర్యంలో 2 వేల మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో షేక్ జిలానీ, నాగూర్, రహంతుల్లా, క్రిష్ణ, పుల్లయ్య, అల్లాభక్షు పాల్గొన్నారు.

నేడు మహిళా డిగ్రీ కాలేజీలో జాబ్ మేళా

చీరాల అర్బన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధి కల్పన సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం చీరాలలోని వైఏ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో మిని జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గంటా సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని యువతీయువకులు జాబ్ మేళాలో పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జాబ్‌మేళాలో స్కిల్ క్రాఫ్ట్, అపెక్స్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, ఫ్లిప్‌కార్ట్ కంపెనీలు హాజరవుతున్నాయన్నారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ డిప్లొమో, ఏదైనా డిగ్రీ, పీజీ, బిటెక్ విభాగాల వరకు చదువుకున్న 18–28 సంవత్సరాల వయస్సు గల యువతీ యువకులు సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు జిరాక్స్‌తో పాటు పాస్‌పోర్టు సైజు ఫొటో తీసుకురావాలన్నారు.

ఆటో ఢీకొని ఒకరికి గాయాలు

కనిగిరి రూరల్: ఆటో, బైక్‌ను ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే..వెలిగండ్ల మండలం చోడవరం గ్రామానికి చెందిన ఓబుల్‌రెడ్డి ద్విచక్ర వాహనంపై బేస్తవారిపేట వెళ్తుండగా... ఎదురుగా హెచ్‌ఎంపాడు నుంచి కనిగిరికి వస్తున్న ఆటో మార్గమధ్యంలో అర్బన్ కాలనీ వద్ద బైక్‌ను ఢీ కొంది. ప్రమాదంలో బైక్ నడుపుతున్న ఓబులరెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రున్ని స్థానిక ప్రవేట్ ఆస్పత్రికి తరలించి వైద్య చికిత్సలు చేస్తున్నారు.

స్పందనకు 19 అర్జీలు

కనిగిరి రూరల్: స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో జరిగిన స్పందనలో సోమవారం 19 అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కనిగిరి మండలం నుంచి 9, పామూరు 1, హెచ్‌ఎంపాడు 2, సీఎస్‌పురం 1, మర్రిపుడి 3, కొనకనమిట్ల మండలం నుంచి 2 అర్జీలు వచ్చినట్లు ఆర్డీఓ కార్యాలయ అధికారి బసిరెడ్డి జయవర్ధన్‌రెడ్డి తెలిపారు. వాటిని పరిశీలించి తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ అజయ్‌కుమార్ తెలిపారు.

మార్కాపురం డివిజన్‌లో 30 పోలీస్ యాక్ట్ అమలు

మార్కాపురం: మార్కాపురం డివిజన్‌లో ఈ నెల ఒకటో తేదీ నుంచి 31వ తేదీ వరకు 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని డీఎస్పీ జి.వీర రాఘవ రెడ్డి సోమవారం తెలిపారు. పోలీసుల అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ధర్నాలు, ర్యాలీలు నిర్వహిస్తే నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

అవినీతిపై విచారణ జరపాలి



మాట్లాడుతున్న పాలడుగు విజేంద్ర బహుజన్

ఒంగోలు: జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో జరుగుతున్న అవినీతి, కుంభకోణాలపై విచారణ జరిపి దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు పాలడుగు విజేంద్ర బహుజన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక దళిత సేన జిల్లా కార్యాలయంలో జరిగిన విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడారు. సాంకేతిక లోపాలు సాకుగా చూపి విద్యాశాఖ కమిషనర్ కార్యాలయంలోని ఒక ఉన్నతాధికారి మౌఖిక ఆదేశాలతో ఉపాధ్యాయుల బదిలీలు జరిగాయని, అయితే పరిపాలనా సౌలభ్యం పేరుతో జిల్లా విద్యాశాఖ కార్యాలయంలోని సిబ్బందిని దోషులుగా చూపుతూ సస్పెండ్ చేయడం దుర్మార్గమన్నారు. పలు విభాగాల టీచర్ల ఎంపికలో లక్షల రూపాయలు చేతులు మారిన విషయం జిల్లాలోని ప్రజలందరికీ తెలుసన్నారు. ఎక్కువ మార్కులు వచ్చిన వారిని పక్కనబెట్టి మెరిట్ లిస్టులో లేనివారిని రెండో జాబితాల చేర్చి లక్షలాది రూపాయలు దోచుకున్నారని విమర్శించారు. పీకా మధుసూదనరావు, ఐనంపూడి నరసింహారావు, పలతోటి ఆంజనేయ ప్రసాద్, కాటుకూరి డేవిడ్, గుంతోటి విజయ్‌రాజ్, మెడబలిమి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రావెల్ రోడ్ల పరిశీలన



పాదర్తిలో గ్రావెల్ రోడ్లను పరిశీలిస్తున్న ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి

కొత్తపట్నం: ఎన్ఆర్‌జీఎస్ నిధులతో జరుగుతున్న గ్రావెల్ రోడ్లను ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి సోమవారం పరిశీలించారు. రంగాయపాలెం పొలిమేర నుంచి బకింగ్‌హామ్ కాలువవరకు పూర్తి చేసిన గ్రావెల్ రోడ్డును పరిశీలించారు. రోడ్డు ఇరుపక్కల షోల్డర్స్ వేయాలని, మధ్యలో నాలుగు తూములు వేయాలని రైతులు ఎంపీపీ దృష్టికి తీసుకెళ్లారు. ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి బకింగ్‌హామ్ కాలువ వరకు వేసిన రోడ్డును తనిఖీ చేసుకుంటూ వెళ్లారు. నాలుగు రీచ్‌లో రెండున్నర రీచ్ పూర్తి చేశారన్నారు. అనంతరం రంగాయపాలెంలో అర్అండ్‌బీ రోడ్డు నుంచి పాదర్తి చెరువుకు రోడ్డు, పాదర్తి గ్రామం నుంచి చెరువు వరకు రోడ్డును పరిశీలించారు. 15 గ్రామ పంచాయతీల్లో 119 పనులకు గాను రూ.10 కోట్లు మంజూరయ్యాయని ఇప్పటికి 6 రోడ్లు పూర్తి చేశామని మిగతావి వివిధ దశల్లో ఉన్నాయన్నారు. రంగాయపాలెం గ్రామ పార్టీ అధ్యక్షుడు ద్వారం మురళి, జిల్లా మైనార్టీ సెల్ ఎస్‌కే కరిముల్లా, కట్టా శేఖర్, ఆదినారాయణ, పాలేటి ఆంజనేయులు, గంపాల వెంకటేశ్వర్లు, సురేంద్ర, శంకర్‌రావు, సంగీతం శ్రీను పాల్గొన్నారు.

పంచాయతీలు పరిశుభ్రంగా ఉంచాలి



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న రవీంద్రరెడ్డి, సునీత, గ్రామస్తులు

ఈతముక్కల (కొత్తపట్నం): పంచాయతీలను పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆళ్ళ రవీంద్రరెడ్డి అన్నారు. పంచాయతీ కార్యాలయంలో సోమవారం స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ కార్యక్రమంలో మాట్లాడారు. ప్రతి రోజూ క్లాప్ మిత్రలు తిరిగి వ్యర్థాలు చెత్త సంపద తయారీ కేంద్రాలకు తరలించాలన్నారు. పరిసరాల పరిశుభ్రతకు ప్రాముఖ్యత ఇవ్వాలన్నారు. మరుగుదొడ్ల వినియోగం తరువాత చేతులు శుభ్రం చేసుకోవాలని సూచించారు. వలింటీర్లు, మహిళా సంఘాలు, ఆశావర్కర్లు సర్వేక్షణ్ గ్రామీణ్ కరపత్రాలను పంపిణీ చేయాలని ఆదేశించారు. సర్పంచ్ మేడికొండ సునీత, పంచాయతీ కార్యదర్శి కె.కిరణ్ కుమార్, నితిన్ పాల్గొన్నారు.

కందుకూరులో చోరీ

- 4సవర్ల బంగారం, రూ.50 వేల నగదు అపహరణ



ప్రధాన ద్వారం తలుపుకు రంధ్రం చేసిన దుండగులు

కందుకూరు: తాళాలు వేసి ఉన్న ఇంటిని లక్ష్యంగా చేసుకుని దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఈ సంఘటన సోమవారం పట్టణంలోని మహదేవపురం రోడ్డులో గల జగనన్న కాలనీలో చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... దిల్షాన్ అనే మహిళ కుమార్తెతో కలిసి పట్టణంలోని మహదేవపురం రోడ్డులో ఉన్న జగనన్న కాలనీలో నివాసం ఉంటుంది. దిల్షాన్ ప్రకాశం ఇంజినీరింగ్ కాలేజీలో వంట మనిషిగా పనిచేస్తుండగా, కుమార్తె కాలేజీకి వెళ్తుంది. ప్రతి రోజు ఉదయం 6 గంటలకు డ్యూటీకి వెళ్లి తిరిగి సాయంత్రం 6గంటలకు ఇంటికి చేరుతుంది. ఈ క్రమంలోనే సోమవారం ఉదయం కూడా ఇంటికి తాళాలు వేసుకుని డ్యూటీకి వెళ్లింది. తిరిగి సాయంత్రం ఇంటికి వచ్చేసరికి ప్రధాన ద్వారం తలుపును కోసి రంధ్రం చేసి ఉంది. అనుమానం వచ్చి ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా ఇంట్లోని రెండు బీరువాలు పగలగొట్టి ఉన్నాయి. బీరువాల్లో ఉండాల్సిన 4సవర్ల బంగారంతో పాటు, రూ.50వేల నగదు అపహరణకు గురైనట్లు గుర్తించింది. దీంతో జరిగిన ఘటనపై రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ముంపు సమస్య తీర్చాలి



సబ్‌కలెక్టర్‌కు అర్జీ ఇస్తున్న నిర్వాసితులు

మార్కాపురం: వెలిగొండ ప్రాజెక్టు ముంపు గ్రామాల్లో నివసిస్తున్న తమ సమస్యలను తీర్చాలని నిర్వాసితులు సోమవారం మార్కాపురం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సబ్‌కలెక్టర్ సేథు మాధవన్‌కు వినతిపత్రం ఇచ్చారు. ముంపు ప్రాంతాల నిర్వాసితులకు ప్యాకేజీని విడుదల చేయాలని, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, సర్వే టైంలో మిస్సైన కుటుంబాలను అర్హుల జాబితాలో చేర్చాలని, భూములు కోల్పోయిన ఎస్సీ, ఎస్టీలకు మళ్లీ భూములివ్వాలని కోరారు. అన్నీ గ్రామాల్లో దేవుని మాన్యం, చుక్కల భూముల ఇళ్లకు, పొలాలకు నష్ట పరిహారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి గాలి వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రతి ఇంటికీ మంచినీటి కుళాయి



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ గంగాడ సుజాత

ఒంగోలు సబర్బన్: నగరంలోని 18వ డివిజన్ చెరువుకొమ్ముపాలెంలో అభివృద్ధి పనులకు మేయర్ గంగాడ సుజాత సోమవారం శంకుస్థాపన చేశారు. రూ. 27 లక్షలతో నిర్మించతలపెట్టిన సీసీ రోడ్డుకు భూమి పూజ చేశారు. పనులు ప్రారంభించనున్న జేసీబీకి పూజలు చేశారు. తనను 18వ డివిజన్ కార్పొరేటర్‌గా గెలిపించినందుకు ఈ ప్రాంత ప్రజల రుణం తీర్చుకుంటానన్నారు. ఇంకా రూ.1.77 కోట్ల పనులు చేయాల్సి ఉందన్నారు. ప్రతి ఇంటికీ ఉచితంగా మంచినీటి కుళాయి వేయించే కార్యక్రమం చేపడతానని చెరువుకొమ్ముపాలెం వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



పీహెచ్‌సీలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ

చీమకుర్తి: మండల పరిషత్ నిధులు రూ.16 లక్షలతో బండ్లమూడి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు సోమవారం ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు శంకుస్థాపన చేశారు. సర్పంచ్ వెంకటలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు విజయలక్ష్మి, మాజీ సర్పంచ్ యెన్నం శేషిరెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పొలంలో మోటార్ చోరీ

మద్దిపాడు: మండల కేంద్రం మద్దిపాడు సమీపంలో ఉన్న గుండ్లకమ్మ రిజర్వాయర్ కుడికాల్వ వద్ద నీటి కోసం ఏర్పాటు చేసుకున్న మోటార్‌ను దొంగిలించారని మద్దిపాడు గ్రామానికి చెందిన ఈమని సింగారావు అనే రైతు పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశాడు. అనంతరం పోలీసులు, రైతు చుట్టు పక్కల వెతుకుతుండగా కనిగిరికి చెందిన నాగులూరు సుధాకర్, వెల్లంపల్లికి చెందిన సుబ్బారాయుడు అనే బాలుడు.. మోటార్‌ను ఆటోలో వేసుకుని పారిపోవడానికి ప్రయత్నిస్తున్న క్రమంలో వారిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. సుధాకర్‌పై పలు చోట్ల కేసులు ఉన్నాయని తెలిపారు. మంగళవారం వారిని కోర్టులో హాజరు పరచనున్నట్లు ఆయన తెలిపారు.

స్పందనకు మూడు అర్జీలు

గుడ్లూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనకు మూడు అర్జీలు వచ్చినట్లు ఎంపీడీఓ చంద్రసేన్ తెలిపారు. దారి వివాదంపై ఒకటి, భూములకు కొలతలు వేయించాలని ఒకటి, హౌసింగ్‌కు సంబంధించి ఒక అర్జీ వచ్చాయని ఎంపీడీఓ పేర్కొన్నారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మూడు చక్రాల స్కూటీ పంపిణీ



మూడు చక్రాల స్కూటీని అందజేస్తున్న ఎంపీపీ క్రిష్టయ్య

లింగసముద్రం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ఒక్కరికీ చేయూతనిచ్చే కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో దివ్యాంగుడికి మూడు చక్రాల స్కూటీని ఎంపీపీ పెన్నా క్రిష్టయ్య సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి అన్ని వర్గాలకు చేయూతనిస్తున్నారని, పేదలను అన్ని విధాలా ఆదుకుంటూ ముందుకు సాగుతున్నారన్నారు. ఎంపీడీఓ శేషుబాబు, ఏఓ కట్టా శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

10న నులిపురుగుల మాత్రల పంపిణీ

హనుమంతునిపాడు: జాతీయ నులిపురుగు నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఈ నెల 10న నులిపురుగుల మాత్రలు నూరుశాతం పంపిణీ చేయాలని డాక్టర్ మూరక ప్రతాపరెడ్డి అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో సోమవారం మండల టాస్క్ పోర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వారు మాట్లాడుతూ మండలంలో 4515 మంది పిల్లలకు మాత్రలు మింగించాలన్నారు. ఎంఈఓ జి.పెద్దిరాజు, ఏఓ జీవి క్రిస్టారావు, తహసీల్దార్ ఎస్ హరిబాబు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ షేక్ గౌషినీసాబేగం పాల్గొన్నారు.